క్లుప్తంగా

200 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ తెలిపారు. దర్గాపురం డాక్టర బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రాబిన్ హుడ్ ఆర్మీ సౌజన్యంతో పిన్నమనేని సిద్ధార్థ డెంటల్ హాస్పిటల్ వైద్య సిబ్బందితో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల దంతాల పరిరక్షణకు తాము ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. తమకు సహకరించిన వైద్య సిబ్బంది, రాబిన్‌హుడ్ ఆర్మీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 200 మందికి ఉచితంగా దంత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు అజయ్, రత్నశ్రీ, రేణుక, సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, మాతృదేవోభవ వృద్ధాశ్రమం సిబ్బంది జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విస్తృత ప్రచారం

పటమట(విజయవాడతూర్పు): ఇండియా స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వంటి పలు అంశాలు నగర వాసులకు వివరించేందుకు వీఎంసీ మొబైల్ వ్యాన్లతో స్క్రీన్లతో విస్తృత ప్రచారం ప్రారంభించింది. ప్రచార వాహనాలను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ప్రధాన కార్యాలయంలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

జానపదం.. జనజీవన వేదం



విజయవాడకల్చరల్: జానపదం జనజీవన వేదమని అంతర్జాతీయ జానపద గాయకుడు డాక్టర్ దామోదర గణపతిరావు అన్నారు. గీతాంజలి మ్యూజికల్, దామోదర జానపదం, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయం సినీ పదం –జానపదం, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గణపతిరావు మాట్లాడుతూ.. శ్రమకైక జీవనంలో పాట కనిపిస్తోందన్నారు. డాక్టర్ జయంతి చక్రవర్తి వేటూరి సుందరరామమూర్తి పాటలోని సాహిత్యపు విలువలను వివరించారు. ఆదిరాల జయప్రభ కె.కృష్ణంరాజు విశాఖపట్నం, రవికుమార్ నూజివీడు, పావని గుంటూరు, అద్దేపల్లి రూపశ్రీ, గీతిక విజయనగరం క్లాసికల్ గీతాలను ఆలపించారు. చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

వినాయకుడికి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీలో నాగగణపతి నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. సోమవారం 5 వేల మందికి అన్నదానం నిర్వహించిన అనంతరం లడ్డూ వేలం జరుపనున్నట్లు నిర్వాహకులు బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తెలిపారు. బల్లం కిషోర్, నాయకులు పాల్గొన్నారు. ముత్యాలంపాడు అమలి స్కూల్ సమీపంలో సత్యనారాయణపురం ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యాన జరిగిన లడ్డూ వేలంలో యశస్వి అనే భక్తులు రూ.24వేలకు దక్కించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్ మార్ నృత్యాలతో నిమజ్జనోత్సవం జరిగింది. వంశీ, సాయిరామ్, పవన్ పర్యవేక్షించారు.

రోబోటిక్స్‌దే భవిష్యత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న కాలంలో రోబోటిక్స్‌దే భవిష్యత్ అని అద్వితీయ ల్యాబ్స్ డైరెక్టర్ ఏ పవన్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో అద్వితీయా ల్యాబ్స్(బెంగళూర్) సౌజన్యంతో కళాశాల ప్రాంగణంలో రోబోటిక్స్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో రోబోటిక్స్ కీలకమైన భూమిక పోషించనుందన్నారు. ఈ సందర్భంగా అద్వితీయా సంస్థతో కళాశాల ఎంవోయూ చేసుకుంది. కార్యక్రమంలో ఆ సంస్థ సీఈవో వై.అఖిల, కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమాంధ్రప్రదేశ్ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 61వ డివిజన్‌లో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): అధికారం చేపట్టిన నాలుగేళ్లలో రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ 262వ సచివాలయ పరిధిలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. వాంబేకాలనీ హెచ్2 బ్లాక్‌లో విస్తృతంగా పర్యటించి 448 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తోన్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. పర్యటనలో భాగంగా స్థానిక 626వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. ప్రతి నెలా పిల్లల బరువులు, ఎత్తులు పరిశీలించి వారి పోషణ స్థితిని గుర్తించాలని ఆదేశించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. ప్రధానంగా రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ఏఏ ఆహార పదార్థాలు తీసుకుంటే పౌష్టికాహారం లభిస్తోందో తెలియజేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

డివిజన్‌లో రూ.13.15 కోట్లతో అభివృద్ధి

టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. ఫలితంగా చిన్నపాటి వర్షానికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తు చేశారు. గత పాలకులకు గాళ్ల వెంకయ్య కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ వంటి ప్రాంతాలు ఉన్నట్లు కూడా తెలియదని ఎద్దేవా చేశారు. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తదనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో డివిజన్లో రూ.13.15 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, పాయకాపురం చెరువును పార్కుగా రూ.3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ప్రారంభించుకున్నట్లు వెల్లడించారు. హెచ్ బ్లాక్ మొత్తం నేడు అంతర్గత రహదారులతో కళకళలాడుతుందంటే, సీఎం జగన్ ప్రభుత్వ పుణ్యమేనని చెప్పారు.

టీడీపీ–జనసేనది వికటించే పొత్తు

రాష్ట్రంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే సత్తాలేదని విష్ణు విమర్శించారు. తెలుగుదేశం –జనసేన పార్టీలది వికటించే పొత్తని ఎద్దేవా చేశారు. మరోవైపు చంద్రబాబు అరెస్టును దేశ సమస్యగా టీడీపీ చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. అవినీతి కేసులో అరెస్ట్ అయిన బాబు కోసం టీడీపీ నేతలు ఏముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్తున్నారో చెప్పాలన్నారు. తెలుగుదేశం పొలిట్ బ్యూరో నిర్వహించాల్సింది చంద్రబాబు అరెస్ట్ అయిన సంద్యాలలో కాదని, కుంభకోణాలకు కేంద్ర బిందువైన అమరావతిలోనని విమర్శించారు. తెలుగుదేశం అవినీతి చరిత్రను ప్రజలు తెలుసుకున్నారని, ఏ ఒక్కచోట బాబుకి మద్దతు తెలిపే పరిస్థితి లేదన్నారు.

కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, డీఈ(యూజీడి అండ్ వాటర్) రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్, నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, కో ఆర్డినేటర్ నాలం బాబు, ఆర్ఎస్ నాయుడు, భోగాది మురళి, వెంకటేశ్వరావు, నాగరాజు, దుర్గాప్రసాద్‌రెడ్డి, రాగోలు పద్మావతి, తిరుపతిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రేమ, సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

దేశభక్తిని నింపిన జాతీయ బృందగాన పోటీలు



దేశభక్తి గీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తోటి వారికి సేవ చేయడం, తనను ద్వేషించే వారిని కూడా ప్రేమించే గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బి.రాజేశ్వరరావు చెప్పారు. భారత్ వికాస్ పరిషత్ విజయవాడ, సెంట్రల్, ఈస్ట్ బ్రాంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నగర స్థాయిలో దేశభక్తి గీతాల జాతీయ బృందగాన పోటీలు శనివారం జరిగాయి. రాజేశ్వరరావు అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తోటి వారికి సహాయం చేసే గుణంతో పాటుగా ప్రేమించడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే వార్తా పత్రికలు, గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్‌ను ఉపయోగించుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఫోన్ చేసినంత మంచి ఎవ్వరూ చేయరని అన్నారు. ఫోన్ పట్టుకుని గేమ్స్ ఆడుకుండూ, సోషల్ మీడియా చూస్తూ కూర్చుని సమయాన్ని వృధా చేసుకుంటే ఫోన్ అంత చెడ్డ వస్తువు మరేది లేదన్నారు. వివేకానంద జీవిత చరిత్రకు సంబంధించిన ప్రశ్నలను అడిగి విద్యార్థులతో ఆయన సమాధానాలను చెప్పించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

భారత వికాస్ పరిషత్ నగర కమిటీ అధ్యక్షుడు ఎంవీఎస్ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి 1967వ సంవత్సరం నుంచి తమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నగర స్థాయిలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రీజనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. హిందీ, సంస్కృతం, రీజనల్, జానపదం విభాగాల్లో విద్యార్థులు గీతాలను ఆలపించారు. భారత వికాస్ పరిషత్ సభ్యులు సురేష్ సొలంకి, సీహెచ్.రమేష్‌బాబు, సంతోష్, ఏవీ.రమణ, పి.వసంత్ కుమార్, ఎస్.జగదీష్, కె.గాంధీ, ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

15 కల్లా ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అక్టోబర్ 15 నాటి కల్లా పూర్తిచేయాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శనివారం వీఎంసీ, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. గతంలో పలు సందర్భాలలో పునరావాస లబ్ధిదారులకు న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ సహా అజిత్ సింగ్ నగర్, బర్మాకాలనీ, పాకిస్తాన్ కాలనీ, రాధానగర్, సంతోషిమాత టెంపుల్ తదితర ప్రాంతాలలో కేటాయించిన దాదాపు 10 వేల ఇళ్లకు జీవో నంబర్ 4, 32 ప్రకారం త్వరితగతిన రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, జాయింట్ డైరక్టర్(వీఎంసీ హౌసింగ్) కెఎస్ఎన్వీ లత, తహసీల్దార్లు మాధురి, వెన్నెల శ్రీను, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు జగదీష్, మోహన్ బాబు, డెప్యూటీ తహసీల్దార్ జ్ఞాన లలిత, టీపీఓలు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

అలరించిన సంగీత స్రవంతి



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో నెల వారి సంగీత స్రవంతి కార్యక్రమంలో భాగంగా శనివారం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో చెన్నైకు చెందిన అమృత మురళి గాత్ర కచేరి స్వరరాగ సమ్మిళితంగా సాగింది. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, భక్తాగ్రేసన వాగ్గేయకారులు రామదాసు, అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు. చెన్నైకు చెందిన ఆర్కే శ్రీరాం కుమార్ వయోలిన్‌పై మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై ఎం. హరిబాబు సహకరించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆకాశవాణి టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంగీతం మనో వికాసం కలిగిస్తుందన్నారు. కర్నాటక సంగీత వైభవాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని వివరించారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ యువ, బాల కళాకారులను ప్రోత్సహించడానికి కార్యక్రమాలతో పాటు ప్రతి ఏటా జాతీయ స్థాయిలో సంగీత పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సంగీత రంగానికి చెందిన చిట్టా రామలక్ష్మి, అంజనా సుధాకర్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్‌లో ఇన్ఫర్మేషన్ పార్క్ పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): అజిత్ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న ఇన్ఫర్మేషన్ పార్క్‌ను శనివారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను పరిశీలించి ఆడిటోరియంలోకి వెళ్లేది, వచ్చేది ఒకే ద్వారం ఉండటం ఇబ్బందిగా ఉంటుందని, మరో ద్వారాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లో ఏర్పాటు చేసే గ్రీనరీని ఎప్పుడు వాడే గ్రీనరీ కాకుండా హెర్బల్, జోడైక్ గార్డెన్ సంబంధించిన గ్రీనరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గాజిబో ద్వారా ఏర్పాటు చేస్తున్న హట్‌ను మాములు బ్రిక్స్‌తో కాకుండా ప్లాస్టిక్ పెట్ బాటిల్స్‌తో బ్రిక్స్ నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. పార్క్‌లో హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా చూడడానికి, చూసి నేర్చుకునే విధంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఇన్ఫర్మేషన్ పార్క్ పారిశుద్ధ్య కార్మికులకు అంకితం చేసే విధంగా కృషి చేస్తున్నామని కమిషనర్ అన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నలంద ఎన్‌సీసీ క్యాడెట్ సంధ్య అరుదైన ఘనత



సంధ్యను అభినందిస్తున్న విజయబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ బుగత సంధ్య 1,250 అడుగులు ఎత్తు నుంచి పారాజంప్ చేసి అరుదైన ఘనత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. రాష్ట్రంలో ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక కాగా, అందులో ఒకరు విజయవాడకు చెందిన తమ కళాశాల విద్యార్థి సంధ్య అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పారాజంప్ సెలక్షన్స్‌తో అర్హత సాధించినట్లు తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారుల పర్యవేక్షణలో ఆగ్రాలోని పారా ట్రూపర్స్ ట్రెనింగ్ స్కూల్‌లో సెప్టెంబర్ 1 నుంచి 25 వరకూ పారాబేసిక్ కోర్సు శిక్షణ పొందారన్నారు. అనంతరం ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానం నుంచి 1,250 అడుగుల ఎత్తు నుంచి నేలమీదకు రెండుసార్లు పారా జంప్ చేసి విజయవంతంగా బుగత సంధ్య శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు శనివారం సంధ్యను అభినందించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):మాదక ద్రవ్యాల నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బావాజీపేటలోని యువభవన్ నందు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మావతి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడడడం నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల్లో ఒకటిగా పేర్కొన్నారు. సినిమాల ప్రభావం యువత మత్తుకు బానిసవుతున్నారన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ యు.సుబ్బారావు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వాటికి పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

పిల్లలకు విలువలు నేర్పించాలి

నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ మత్తు బానిసత్వం నుంచి యువతను విముక్తి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ సువార్త మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విలువలు నేర్పించాలన్నారు. రాష్ట్ర మహిళా సంరక్షణ జనరల్ సెక్రటరీ డి.మధులత మాట్లాడుతూ మత్తుకు బానిసైన వారిని రక్షించటానికి నవజీవన్ బాలభవన్‌తో కలిసి పని చేస్తామన్నారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ బాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయట పడేసేందుకు డీ–ఎడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐర్లాండ్ డాన్ బాస్కో ప్రతినిధి టోనీ బ్రుక్, నవజీవన్ బలభవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, అడ్మినిస్ట్రేటర్ తంబీ, సెబ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్‌కే నజ్మా, వసంత కుమారి, జాకబ్ రాజు, కె.ప్రియాంక, బి.రవి, బి.నెహేమియా, డి.రజిత, రాణి, హైమావతి పాల్గొన్నారు.

అండర్ వాటర్‌షిప్ టన్నెల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగర వాసులకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించడానికి సీ వరల్డ్ పేరుతో అండర్ వాటర్ షిప్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని శాతావాహనా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ షిప్ టన్నెల్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. దసరా పండుగ సెలవుల్లో నగర వాసులు ఈ ఎగ్జిబిషన్ ద్వారా ఆహ్లాదాన్ని పొందవచ్చునన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎన్.గురుగోపీనాథ్, సైఫ్ ఖాన్ మాట్లాడుతూ నగరంలో 2 వేల రకాల చేపలతో ఈ షిప్ టన్నెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు జెయింట్ వీల్, కొలంబస్, టోరా టోరా, బ్రేక్‌డ్యాన్స్ ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకతమని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో లభించే వస్తువులు, గృహాలంకరణ సామాగ్రితో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందని, నగర వాసులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించాల్సిందిగా కోరారు. స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత, అడపా ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు



జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శనివారం బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఏకరూప దుస్తులు ధరించి జాతీయ జెండాలు చేతబూని బీఎస్ఎన్ఎల్ ఆకారంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఈ ఏడాది నుంచి దేశ వ్యాప్తంగా 4జీ సేవలు ప్రారంభిస్తుందన్నారు. విజయవాడ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్, సర్కిల్ కార్యాలయం ఉన్నత అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాత్మాగాంధీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఐటీసీ సహకారంతో పాడిచెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. వ్యర్థాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో హేమ మహేశ్వరి, అధ్యాపకులు పి.శైలజ, బి.నాగమణి, టి.దేవేందర్‌రెడ్డి, వి.ఆశీర్వాదం, జి.గంగాధరరావు, జుబేదా, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శంఖారావ సమైక్య స్ఫూర్తి దినోత్సవ వేడుకల్లో మల్లాది విష్ణు, డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, జగన్మాత శ్రీఈశ్వరి దేవి మఠం పీఠాధిపతి వీర శివకుమార స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. బీసీలు, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 25 లక్షల మంది విశ్వబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇటీవల కాలంలో కుల దూషణ ఎక్కువగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం, వసతి గృహాల నిర్మాణాలకు టీటీడీ ద్వారా ఎకరం స్థలం విశ్వబ్రాహ్మణ సంఘానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టీ రంగబాబు, వివిధ జిల్లాల కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను నిర్వాహకులు సత్కరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మొక్క నాటుతున్న వెంకటేశ్వర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో జాతీయ పౌష్టికాహార మాసం ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో రాజభాష హిందీ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏవీ లక్ష్మి బహుమతులను అందజేశారు.

‘జగనన్న సురక్ష’తో ఆరోగ్యకర సమాజం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యకర సమాజ స్థాపనకు జగనన్న సురక్ష పథకం దోహదపడుతుందని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురం 198వ వార్డు సచివాలయంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్స్‌తో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ.. జగనన్న సురక్ష పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం జగనన్న సురక్ష పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరిచందన, వార్డు సచివాలయం కన్వీనర్లు కొండాయగుంట రాము, పసుపులేటి ఏసు, బత్తిన సీతారామయ్య, బ్రహ్మ దేశం వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు, సాంబమూర్తి, ఆరోగ్య సిబ్బంది సుకన్య, లక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.